రంజని

# పచ్చి ప్రేమకథ

—ఎమ్మెస్సార్

ఏవోనబ్బా...ప్రేమించి పెళ్ళి చేసుకోవడమేమో గాని అసలు ప్రేమించడమే నా వల్ల కాలేదు!

ప్రేమించడం అనుకున్నంత తేలిక్కాదు. ప్రేమించి పెళ్ళి చేసుకోవడం కూడా అంత తేలిగ్గా సాధ్యం కాదు. అలా చేసుకున్నా అదే ప్రేమని జీవితాంతం ఆస్వాదించడం...గొప్ప సంగతే ననుకోవాలి!

అందుకే ప్రేమకంత విలువ-గిరాకీ, గౌరవం, భక్తి-ఇవన్నీ కాక మళ్ళీ ప్రేమమీద జనాని కంత వల్లమాలిన ప్రేమ!

పోతే...పెద్దవాళ్ళు చేసిన పెళ్లితో...త్వరత్వరగా వెంటనే ఒకరి మీద ఒకరు ఎలా ప్రేమలో పడిపోయి అలాగే ప్రేమించు కుంటుంటారో తలుచు కుంటుంటే... నవ్వొ కాదు కానీ...విడిగా మళ్ళీ ప్రేమించే ఎందుకు పెళ్లి చేసుకోవాలా అనిపిస్తుంటుంది. కానీ, వీళ్లు ఏదో కథ చదివో, సినిమా చూసో... ప్రేమంటే ఏమిటో వీపు మీద చరచినట్టో, కుదించినట్టో, అనిపించి, ఇక ఆ జీవితానికి తమ ప్రేమ ఛాన్సు పోయిందని కంగారు పడ్డంకద్దు. ఈ కంగారు కథలే తారసపడేవి, మనసయ్యేవి, దగ్గరికి తీసేవి, ఉంచుకునేవి, లేచిపోయేవి...పోనిండి అవన్నీ. మనకెందు కనుకున్నామా అవన్నీ ప్రేమ మూలంగానే నటుంటారు. విడిగా ముడి ప్రేమని దేవుడితో పోలుస్తుంటారు! అది అంత పూజ్యమయిందయితే ఈ గుసగుసలు, చెమటలు పట్టడం, గోల, గలిబిలి, అన్యాయం, ఘోరం, ఎవరి పాపాన వాళ్లు పోవడం...ప్చ్...ఎందుకో నాకు బొత్తిగా అర్థం కాని మిథ్యయి పోయి, వదిలేసి,...ఎంచక్కా వచ్చిన పాపిటనే మళ్ళీ ఇంకా బాగా రావాలన్న ధ్యాసతో తల దువ్వుకుంటూ, నా పొడవాటి జడను చూసుకుంటూ కాలం గడుపుతున్నాను.

సరే...నాకూ పెళ్ళయిందనుకోండి.

'సారథి' అని రాస్తున్నానే గాని, నేనెప్పుడూ, ఆయన్ని పేరెట్టి పిలవలేదు. పిలుద్దామను కుంటాను. ఏమిటో భయం. నాకు తెలిసిన వాళ్ళని చాలా మందినీ చూసాను. అడిగాను. వాళ్ళు 'ఏవండీ' అనే అంటారు. కానీ నేను మాత్రం...అలా పేరుతో పిలవడం ప్రేమకి ప్రతీక అనుకుంటాను. కేవలం అనుకోవడంలో తప్పేం వుందీ.

ఇది కేవలం నా కథ కాదు. నా భర్త సోది కథ కాదు. ఒక ఆడ-మగ కథ అనుకోండి.

భార్యా భర్తల మధ్య 'మీకు తెలియని బోల్డు విషయాలుంటా' యంటారు. పచ్చి అబద్ధం. ఏవీ ఉండవు. ఉండడానికి వీల్లేదు. అవి మీకు తెలియని విషయాలే అయితే వాళ్ళిద్దరూ అసలు కలిసి ఉండలేరు. అద్సరే... మనలో మనమాట-చెప్పండి. మాకు తెలియని ఏ గొప్ప విషయాలు మీ భార్యా భర్తలోనో లేక మధ్యనో ఉన్నాయి?



రంజని

కదూ...లేవు! అదే నేననేది.

సారథితో నాకు పరిచయం పెళ్ళి పీటల మీదనే. పెళ్ళి చూపుల్లో నాకే ఈ 'దడ' అనుకున్నాను. దాదాపు అతనికి అంతేగాని మగాళ్ళు అట్టే కనపడరని మీకు తెల్సుగా, సరే...పీటల మీద మంచివాడే ననిపించింది. పెళ్ళి తతంగంలోని పతాక సన్నివేశంలో...అబ్బ... నవ్వకండి...యధా తధంగా రసికుడే! ఇంటి యజమానిగా తప్పకుండా ఓ ఇల్లాలి అభిమానం పొందతగ్గవాడే!

మీలాగే నేను సారథిని ఏవండీ అని పిలుస్తాను. అతను 'ఇదుగో'......'అదుగో' అనో లేక పోతే 'ఏవోయ్' అనో...ఒక్కోసారి నా పేరుతోనే పిలుస్తాడు. నన్ను పేరుతో పిలుస్తుంటే జిల్లుమన్నట్టుంటుంది. నేనూ అతన్ని పేరుతో పిలవాలనీ-అతనితో మనసారా స్నేహం కలపాలనీ...ప్చ్...

నేను అందంగా ఉంటానని సారథి గర్వంగా అంటాడు. నేన్నవ్వుతాను. చలాకీ పిల్లవంటాడు. కళ్ళు అదోలా తిప్పడం ప్రతి ఆడ పిల్లకీ ఆ క్షణాన తెలిసినట్టే నాకూ తెలుసు, కాకపోతే ఛీ 'పోండి'అనో 'పాపం' అనో వెక్కిరింపుగా అంటాను. పొదివి పట్టుకుంటాడు. 'ఇప్పుడు' కాదంటాను. ఇవన్నీ మన చిట్కాలు. మీకు తెలియందే వుందీ...!

కట్నాల గొడవలు వదిలేసెయ్యండి. అదృష్టవశాత్తూ మాకు ఆర్థిక ఇబ్బందులు లేవు. అంటే మరీ భాగ్యవంతులమని కాదు ఇకపోతే ఇద్దరం చదువుకున్నాం ఎక్కువ తక్కువ భావాలు లేవు.

వండు కోవడం తినడం సినిమాల కెళ్ళడం పత్రికలు చదవడం-రొటీన్ రొమాన్సులతో విపరీతంగా అలసిపోయినా కలత నిద్రపోవడం-ఇదే నా జీవితం. అనుకుంటూ ప్రేమించి పెళ్లి చేసుకుంటే గూడా ఇవే మెకానిక్సా అని ఆలోచిస్తున్నాన్నేను.

సరిగ్గా అప్పుడే మా ఇంట్లో ఓ ముసురులాంటిది పట్టింది.

నాలుగైదు రోజులుగా సారథి అదోలా ఉన్నాడు. నేనంటే తనకి వల్లమాలిన ప్రేమ అన్లేనుగాని అదో నమ్మకం. భర్తలకి భార్యలంటే వల్లమాలి నమ్మకం-మనమేదో ఉద్ధరింప బడుతున్నామనో పోషింపబడుతున్నామనో మరేమిటో...కానీండి ఏం చేస్తాం.

తాపీగా, ఓ రోజు...ఇంటి కప్పువేపు చూస్తూ... తన ప్రేమ కథ చెప్పాడు.

నాలో వెంటనే ఓ గొప్ప రియాక్షన్ ఉంటుందని ఊహించిన సారథి పొరబడ్డాడు. ప్రేమించడం అనేది అదేదో థ్రిల్లింగ్ సబ్జక్టనుకుంటారు మగాళ్లు.

నేను ఇంకా చొరవగా "...కుంటే కున్నారు గానీ కలుసుకున్నారా" అనడిగాను. పచ్చిగా అడిగానే అని నా లిక్కరుచుకున్నాను. అలా అడగడంలో నా ఉద్దేశం వేరు-ఆ ప్రేమ కేవలం శారీరకమా లేక అతీతమా అని తెలుసుకుందామన్న తపన. అలాంటి ట్రూలవ్ కనీసం నా భర్త కైనా ఉందా అన్న అన్వేషణ 'తప్పా' అన్నాడు.

తప్పు లేదు. మనసులు కలిస్తే తప్పేమీ లేదు. కానీ శరీరాల కలయిక కోసం మనసుల్ని ఊరికే కలగా పులగంగా కలిపే ప్రయత్నమే నా కర్థం కాదు. ఇవన్నీ ఆయన్తో ఎందుకని "తప్పేంలేదు. సహజం కూడా నీ" అన్నాను.

ఆ తర్వాత ఆ విషయం గూర్చి అంతా మర్చిపోయాను. కానీ అప్పుడప్పుడూ, నా ప్రవర్తనని



ఆయన పట్టి పట్టి చూస్తున్నప్పుడు-ఓహో ఈయన ప్రేమ గొడవగామోనని గుర్తుకు వస్తుండేది.

నా మౌనాన్ని అంగీకారంగా తీసుకున్నాడో మరేమిటో తన లవ్... ఆవిడ పేరేమిటమ్మా... సుసీత...ఆఁ... సునీతని పెళ్లి చేసుకుంటాను-నీ కభ్యంతరమా" అన్నాడు. అంతటితో ఊరుకుంటే బాగుండేది- "నీ కేమీ లోటు రానీయను" అన్నాడు నా కళ్ళల్లోకి చూస్తూ.

నాకు నవ్వొచ్చింది. నవ్వేను.

మరి అతనికి ఆశ్చర్యం కలగదా!

"నాకేమీ లోటు రానీయనన్నారు-లోటంటే-ఏమిటి" అన్నాను. ఆయన పలకలేదు.

నేనట్టే ఈ విషయాన్ని నాన్న దలచుకోలేదు.

"మీ ఇష్టం, నాకేమీఁ అభ్యంతరం లేదు" అన్నాను. అని నిట్టూర్చాననుకోకండి.

పైకి కనిపించలేదుగానీ దాదాపు షాక్ తిన్నాడు.

"నాతోనే ఉంటావు గదూ..."లాలనగా అన్నాడు.

కావాలనే నేను సారధివేపు చూడకుండా "పరిస్థితులను బట్టి-అప్పుడాలోచిద్దాం లెండి" అంటూ పని ఉన్నట్టుగా అక్కడనుంచి వెళ్లిపోయాను.

నేను ఆ మాటలు వినగానే పలకననో, గోల పెడతాననో, చీదరించుకుంటాననో...కనీసం ఏడుస్తాననో సరే... ఇవన్నీ రాయడ మెందుకు... ఆడవాళ్ళు ఇలాంటి పరిస్థితుల్లో ఎలా ఉంటారో మగవాళ్ల భయపడతారో ఆ భయాలన్నీ నాలో లేకపోవడం వల్ల సారధి మొఖం పాలిపోయింది.

తనకి నేనొక 'అడ్డం' కాకపోతే సంతోషపడాలి గానీ పాలిపోవడ మెందుకు?

ఎందుకంటే...నేనేమిటీ అని. నాకింత ధైర్యం ఎలా వచ్చిందని ఆ తర్వాత నేనేఁచేస్తానని.

ఒక వేళ ఏదైనా చేస్తే తనకేమిటవుతుందో... ఈ కొత్త భయం పాత భయాలకంటె ఇంకా క్రూరంగా ఉండడం సారథిలో గమనించాను.

ఇంట్లో విషయాలు, షరామామూలే! మీకు చాలా ఆశ్చర్యంగా ఉండొచ్చు. నేను మాత్రం ఏవీఁకదల్లేదు. భయం అతన్లోనే. అతని భయాలికి నేనేఁచేయగల్ను? నేనుధైర్యంగా ఉండే కొలదీ ఇంకా ధైర్యంగా ఉండా లనిపిస్తోంది.

సరే...అంతదాకా కూడా వచ్చింది.

'గుళ్లో పెళ్ళి చేసుకుందామను కుంటున్నాను. నిన్ను పెళ్ళికి తీసుకురావాలా అక్కర్లేదా అని ఆలోచిస్తున్నాను,' అన్నాడు. నేను ఇలాఁటి విషయాలు నాన్చనన్నానుగా, 'నాకేమీఁ అభ్యంతరం లేదు. ఆవిడ ఇష్టమేమిటో కనుక్కోండి' అన్నాను.

ఈ సమాధానం కూడా సారథి ఆశించలేదు. తెప్పరిల్లుకుని 'సునీతని నీకింకా చూపించనేలేదు...సారీ'! అన్నాడు కొత్తగా ఓ తప్పు ఏదో చేసినట్టు.

"డోంట్‌వర్రీ సారూ-అసలావిడకీ నన్ను చూడాలనిలేదు. ఆమెకు లేని ఇంటరెస్టు నాకెందుకు" అన్నాను.

సునీత అందంగా ఉంటుందా?-ఉద్యోగం చేస్తుంటుందా? ప్రాపర్టీ ఉందా!-పెళ్ళయిందా? సినిమాతారా లేకపోతే దిక్కూమొక్కూ లేని బీద అనాధా?-అంటే మీరేం చూసి ఆమెని ప్రేమించి మరీ పెళ్ళి చేసుకుంటున్నారు? ఇలాంటి ప్రశ్నలన్నీ వెయ్యలేదని సారథి విస్తుపోతున్నాడు. నాన్నకి ఉత్తరం వ్రాస్తాను. అన్నయ్య చేత తన్నిస్తాను. కోర్టు బాబాయికి చెప్పిన

ముప్పతిప్పలు పెడతాను ఇలాంటి బెదిరింపుల్లు కూడా బహుశా ఆశించి ఉండిన సారథి ఓడిపోయినట్టు ఫీలవుతున్నాడు.

నేను నిశ్చలంగా ఉన్నాను. ఎప్పటికి ఏది చెయ్యాలో మనసుకి తడుతుంది అని నా నమ్మకం. ఆ నమ్మకమే ఆడవాళ్ళనిలా ఇంత మాత్రమైనా ఉండనిస్తుందని పెద్ద విశ్వాసం. నేను మీ అంత గొప్పగా చదువుకోకపోయినా కొన్ని జీవిత సత్యాలు అలాగే అర్థం చేసుకున్నాను.

ఇపుడు సారథికి పెద్ద చిక్కు ఏమిటంటే; తను నాతో కూడా చెప్పి అంగీకారం తీసుకున్న మీదట కూడా తను...అదెవరమ్మా... ఆ సునీతని...పెళ్లి చేసుకోవాల్నా వద్దా అన్న పెద్ద డౌటు.

ఈ డౌటుకీ; అతను పెళ్లి చేసుకున్న తర్వాత నేను ఏం చేస్తానన్న దానికీ అవినాభావ సంబంధం ఉంది. అది 'ఇదీ' అని తెలీకపోతే ఈ సాహసమో-పోనీ-బలహీనమైన పనో చేస్తాడని నేననుకోను.

అడక్కపోతే చెప్పను గదా- దానికీ సమయం రావాలి. అడిగాడు. "నిన్ను అనవసరంగా క్షోభ పెడుతున్నాను. నేను అనవసరంగా ఈ సమస్యలో ఇరుకున్నాను. ప్లీజ్, నీకేదో త్యాగం లాంటిది... గొప్పది" మాటలు తడబడుతూ ఇలాగే చెప్పుకుపోయాడు "ఏదైనా చేయాలనిపిస్తుంది. నీ సంతోషం లేకపోతే నేనేం చేయను" అన్నాడు.

"అయితే?" అన్నాను నేను కనుబొమ ఎగరేస్తూ, "నేనిలా చేస్తున్నందుకు ... రానురానూ ఏమిటో ఫీలవుతున్నాను"

"ఫీలవకండి" అన్నాను ముక్తసరిగా.

"నువ్వేదయినా కోరుకుంటే...అదిస్తేనే కాని అలా బాధపడ్డం ఆగిపోదు"

అమ్మయ్య! వచ్చింది. నేననుకున్న క్లయిమాక్సు దానంతట్ట అదే వచ్చింది.

నేను గొంతు సవరించుకుంటుంటే ఉలిక్కిపడ్డాడు. "చూడండి-నేను మిమ్మల్ని బాగా అర్థం చేసుకున్నాను. భార్యగా కాక ఓ స్నేహితురాలిగా మీకన్నీ చెస్తూనే ఉన్నాను. ఇక నేను ఏదైనా కోరుకోవడమంటారా-ఈ విషయం ఇక చర్చల్లేకుండా ముగిసాక అంటే-మీకు మళ్ళీ పెళ్ళయ్యాక-నా స్నేహితం మీతో పరిపూర్ణంగా భావించి, మీరు అడిగినా అడక్కపోయినా ఇచ్చినా, ఇవ్వకపోయినా-ఓ స్వతంత్రం తీసుకోదల్చుకున్నాను" అన్నాను.

"ఏమిటది?"

"మనం కలసిఉన్నా ఉండకపోయినా, ఒంటరిగా ఉన్నా పదిమందిలో ఉన్నా మీ ఇంట్లో నైనా మా ఇంట్లో నైనా మిమ్మల్ని మాత్రం మీ పేరుతోనే పిలుస్తాను."

నేనిలా అన్నప్పుడు సారథి ముఖాన్ని అసలు మీరు చూసి ఉండాల్సింది.

* *

ఆ మర్నాడే, నిర్ణయాలు తీసుకోవడంలో నన్ను అనుకరిస్తున్నట్టుగా సారథి పెద్ద రిలీఫ్‌తో "నేను ఆలోచించుకున్నాను. నిర్ణయం తీసుకున్నాను. సునీతని పెళ్లి చేసుకోవడం లేదన్నాడు

నేనో నవ్వు నవ్వి ఊరుకున్నాను.

"అబ్బ ఎంత వేదాంతిలా నవ్వావు. ఈ నీ నవ్వే నన్ను జయించిందిం" అంటూ కౌగలించుకోబోయాడు, సరే...మామూలే ననుకోండి.

## రంజని

'అద్సరే...సునీత నిన్ను చూడాలని పరితపిస్తోంది' అన్నాడు.

'స్వా...గతం' అన్నాను.

ఆ రోజు సారథి ఉత్సాహంగా ఉన్నాడు. ఎప్పుడూ అంత సంతోషంగా లేడు.

'సారీ...నిన్ను ఈ విషయాలతో 'చాలా కలవర పెట్టాను'. దిగులు పడ్డాడు కాసేపు.

'మీరే కలవర పడ్డారు. నాకెందుకూ కలవరం...'

'ఏమిటీ మరీ అలా కథలో క్యారక్టర్ లాగాఅంటావు? నేను పెళ్ళి చేసుకుంటే నీకేం బాధలేదా?'

ఇదో యక్షప్రశ్న. నా సమాధానం వేరైనా అతని హితం వప్పుచెప్పాను.

'నాకేమీ లోటు రానివ్వనన్నారు గదా!'

'ప్చ్...కాదు. నీకేమిటో ధైర్యం-నాకా ధైర్యం చెప్పకూడదా!'

'ధైర్యమున్న మాట నిజమే, ఇదీ-అని చెప్పలేను. మీరు ఆవిడ్ని పెళ్ళి చేసుకునే వాళ్లు. జనంలోకి ఈ వార్త వెళ్ళేది. సారథి పెళ్ళాన్నొదిలేసేడు అనే వాళ్ళు'

'మరినువ్వో' అధికాదేమోనన్న అనుమానంతో అడిగాడు. 'నిజం చెప్పేదాన్ని, తను ఎవర్నో పెళ్ళి చేసుకోవాలనుకున్నాడు. నిజం నాతో చెప్పాడు, ఏడ్చి, రాచి రంపాన పెట్టకుండా నేనే వదిలేశాను అనేదాన్ని' ఆడవాళ్ళు మగవాళ్ళని వదిలేయడం కటువుగా ఉంటుందేమో! సారథి ఫీలయ్యాడు.

నేను తేలిగ్గా నవ్వుతూ 'మీపాటికి మిమ్మల్ని వదిలేశాను గదండీ' అన్నాను.

టాపిక్ మారుస్తూ 'నువ్వే గొప్పదానివిసుమా. నేను నీకు విడాకు లిస్తేనేగాని పెళ్ళి కుదరదంది సునీత'.

'నాకు తెలుసు'.

'ఎలా.?'

'ఏ వుందీ...మనిద్దరి స్నేహంకంటె మన భార్యాభర్తల. లాంఛన బంధుత్వం అంటే పెళ్ళికే తాను, భయపడి పోయింది.'

మా ఇద్దరి మధ్య చాలా సేపు నిశ్శబ్దం. ఆ తర్వాత తలదించుకున్న సారథి నావేపు ఓరగా చూశాడు. ఆ చూపుల్లో ఓ వేదన ఉంది.

ఇటీజ్ ఆల్‌రైట్ అన్నట్టు ప్రోత్సాహకరంగా నవ్వాను.

'నన్ను క్షమించు' అన్నాడు.

అది వెన్నెలయినా, సారథి కళ్ల తడితో రెపరెపలాడాయని గుర్తించాను. పదండి పొద్దుపోయిందంటూ ఇంట్లోకి అడుగులు వేశాను.

* * *

రోజులు దొర్లుతున్నాయి.

సునీత నన్నుగా చూడ్డానికి రాలేదు. నేను తన ప్రస్తావన తేలేదు.

సారథి మునుపటిలాగా మామూలు మనిషయ్యాడు అంటే అన్నీ మర్చిపోయాడు లెండి. ఇదిగాక నామీద గౌరవం కూడా పెంచుకున్నాడు.

ఈ గౌరవంతోనే ననుకుంటాను, ఓ రోజు... అదే మల్లెపందిరికింద కూర్చున్నపుడు.. వెన్నెట్లోనే అడిగాడు

'నేనేవీ అనుకోను...నీకూ ఓ ప్రేమ కథ ఉంది ...కదూ?' అన్నాడు.

అన్నాడే కానీ 'చెప్పవూ' అన్న అర్థం ఉంది.

నేను నవ్వాను. అవునన్నట్టు తలూపాను.

మగవాళ్ళ మాటల్లో ఆ తర్వాత వెలగాల్సిన అగ్గిపుల్ల అంత త్వరగా వెలగదు. కానీ అతని కళ్ళలోని

ఆ తర్వాత ప్రశ్నని వెలిగించలేని ఆరవ్వాల్ని చూడగలను. నా కళ్ళల్లోకి చూస్తున్నది సారథి కాదు. నేను తన భార్యాననే ఇన్‌స్టింక్టు.

ఆ ప్రవృత్తి...కనీసం నా ప్రేమలో ఓ ముద్దయినా లేదు అంటే నమ్మేదు సరికదా మేఁకలుసుకున్నామో లేదో వెంటనే కావాలి.

సారథి కళ్ల మూసుకుని పెదిమ కొరుక్కుంటూ "ఆ తర్వాత" అన్నాడు.

'మీరూ హిస్తున్నది నిజవేఁ...తప్పా' అన్నాను. అడగలేదు సుమండీ...

పేలవంగా, బాధగా రిలాక్సయినట్టు నవ్వాడు. కళ్ల తెరిచి నన్ను అదోలా తీవ్రంగా చూశాడు. నేనేదో భయంకరమైన తప్పు చేసినట్టూ అది తాను భరించలేనట్టు; 'కంగారు పడకండి. మీరెంత సరదాగా అడిగారో అంత సరదాగానూ చెప్తున్నాను. ఒట్టు, నిజం, నేను అబద్ధం చెప్పి మిమ్మల్ని నమ్మించాల్సిన గొప్పతనం మీలోనూ లేదు—దాన్ని ప్రేమే అంటారో లేదో గాని...అప్పటికి నాకింకా వయసు రాలేదు.'

సారథి కొంచెం వత్తిగిలి 'అతను మళ్ళీ ఎప్పుడైనా తారసపడ్డాడా?' అన్నాడు.

పడితే మావళ్ల దగ్గరుందా అని సారథి ఉద్దేశం చూపుల్లో తెలుస్తూనే ఉంది. చెమట వాసన వేసే వంటి మీద చోట్లని మగవాళ్ల అబ్బ...ఇంత సాంప్రదాయంగానూ ఊఁ అంటూ ముద్దెట్టుకుంటుంటారు. కొన్ని చేష్టలు భావాలు సహజానికి అతీతంగా ఉంటాయి. అన్నట్టు మీకు తెలీకుండా ఉంటుంధా!

'పూర్తిగా చెప్ప నివ్వడం లేదు మీరు' అన్నాను సారథిని చూస్తూ, కానీ ఆ తర్వాత అతని వేపు చూడలేక పోయాను.

ఊపిరాడ్డం లేదని పించింది. చెమట మెడ కింద నోటితో గాలి ఊదుకున్నా ఉక్కగా ఉంది. కొంగు పూర్తిగా తీసి గాలి కోసం విసిరి వీపు తుడుచుకుని మొదలెట్టాను.

'నేను చాలా చిన్న పిల్లని,' ఎబిసిడిలు దిద్దుతూ కూర్చున్నాము—అతని పేరు రవి. అలా చదువుకున్నాక ఆడుకుంటుంటే...నాన్న చూశాడు. రవిని కొట్టాడు. చంపేస్తానన్నాడు. రవిని నేను ముద్దెట్టుకున్నానో నన్ను రవి ముద్దెట్టుకున్నాడో అంతగా గుర్తు లేదు. అంతమాత్రానికే ఎందుక్కొట్టాడో తెలీదు. భయంతో రవి జ్వరాన పడ్డాడు.'

నావళ్ల జలదరిస్తుంటే యాంత్రికంగా మళ్ళీ మొదలెట్టాను. 'మామ్మూలుగా నాన్న నేను ఎప్పుడూ కలిసి అన్నం తినే వాళ్ళం. ఆ రోజు ఇద్దరం తిన్లేదు. ఆ జ్వరంతో రవి చని పోయాడు'.

నేను చంద్రుణ్ని చూస్తూ ఉండి పోయాను ... చాలా సేపు... నా అరచేతిని తన అరచేతిలోకి తీసుకుని వేళ్ళల్లో వేళ్లదూర్చి స్నేహ పూర్వకంగా గట్టిగా పట్టుకున్నాడు సారథి.

* * *

బహుశా...ఆక్షణాన్నించే...ఈ విషయం సారథికి తెలిసినప్పట్నుంచే నన్నో నిజమైన స్నేహతురాలిగా చూడ్డం మొదలెట్టాడు. దానికి కారణం నాలో అతను అతనికి తెలీకుండా, పోనీ తెలిసీ తెలియకుండా వెదికే ఓ అనవసరమైన పరిపూర్ణత కావచ్చు.

మా అబ్బాయి పేరు రవి!

బాగుంది. నేను కాదబ్బా...సారథే పెట్టాడు ఆపేరు ఆసలు సంగతి చెప్పడం మర్చిపోతానేమో—ఇప్పుడు ఆయన తనని పేరు పెట్టి పిలిస్తేనే కానీ పలకడు. వినే వాళ్ళకి...మీక్కూడా...ఎబ్బెట్టుగా ఉండొచ్చు.

నాకు మాత్రం...ముందే చెప్పాను గదోయ్...